అమృత కణాలు:

శ్రమణభగవాన్ మహావీరుని
అమర సందేశం

1. నేటివరకు విననటువంటి శ్రేష్ఠధర్మాన్ని ఆసక్తితో వినండి.
2. ఆ ప్రకారం విని, గ్రహించిన ధర్మాన్ని ఆచరించండి.
3. సంయమ సాధనతో పాప కృత్యాలను నిరోధించండి.
4. తపఃసాధనవలన పూర్వపాపాలను నశింపచేసుకోండి.
5. నిరాశ్రయులకు, నిస్సహాయులకు ఆశ్రయం, సహాయం, కలిగించండి.
6. యువకులకు ఆచారవిధానాలను గురించి జాగ్రత్తగా తెలపండి
7. ఎల్లప్పుడు ప్రసన్నభావంతో రోగులకు సేవచేయండి.
8. తోటివారిలో ఏకారణంగానైనా, అభిప్రాయభేదం, కలహం, కలిగితే, వారిని శాంతింపచేసి, సద్భావ ప్రచారం చేయండి.

—స్థానాంగ అష్టమ సూత్రం.

మృత్యుంజయుడు
(భగవాన్ మహావీరుడు)

(మహావీరుని 2500 నిర్వాణోత్సవ సందర్భంగా ప్రచురించబడినది)

రచన :
'నిర్మల్'

ప్రకాశకులు :
భగవాన్ మహావీర్ 2500 వ నిర్వాణ సమితి
ఆంధ్రప్రదేశ్

నమస్కార మహా మంత్రము

ణమో అరిహంతాణం

రాగ-ద్వేషాలు, కామ-క్రోధాదులను జయించిన అరిహంత అయిన (అంతశ్శత్రువులను నశింపచేసిన) భగవానునికి నమస్కారం.

ణమో సిద్ధాణం

కర్మబంధాలనుండి ముక్తిపొంది, అష్టసిద్ధి పొందిన సిద్ధ మహా పురుషులకు నమస్కారం.

ణమో ఆర్యాయణం

ఆచార సంపన్నులై, ఇతర సాధువులను నియమ నిర్వహణకు ప్రోత్సాహిస్తూ. సంఘ కట్టుబాట్లను, నియమాలను సరిచూచే ఆచార్య పుంగవులకు నమస్కారం.

ణమో ఉవజ్ఝాయాణం

సంఘంలో ఉండే సాధువుల చేత, సాధ్వీమణుల చేత ఆగమాలు-శాస్త్రాలు అధ్యయనం చేయించే ఉపాధ్యాయులకు నమస్కారం.

ణమో లోయే సవ్వ సాహూణం

లోకంలో ఉండే సర్వ సాధు జనులకు నమస్కారం.

ముందు మాట

ఈ పుస్తకము ఉన్నత పాఠశాల విద్యార్థుల కొరకు డాక్టరు భీమసేన్ నిర్మల్ (ఉస్మానియా విశ్వవిద్యాలయం రీడర్) గారు వ్రాశారు.

ఈ సంవత్సరము భగవాన్ మహావీరుని 2500 నిర్వాణ వార్షికోత్సవము. హైస్కూలు విద్యార్థులకు భగవాన్ మహావీరుని జీవిత విశేషాలను, ఆయన ఉపదేశాలను తెలియజేయాలని రాష్ట్రసమితి నిర్ణయించింది. ఈ ఉద్దేశ్యంతోనే విద్యార్థుల కొరకు ప్రత్యేకముగా వ్రాశారు. ఆదర్శ సమాజ స్థాపనకొరకు మహావీరుడు అహింస, సత్యము, బ్రహ్మచర్యము, అపరిగ్రహము, అచౌర్యము అను సిద్ధాంతాలను సిద్ధాంతీకరించారు. సాధువులు ఈ వ్రతములన్నింటినీ పూర్తిగా పాటించవలసివుంది. గృహస్థులు మాత్రము బహుకొద్ది పరిమితిలోనే పాటించనగును. దానికి ఆయన అణువ్రతమనే సంజ్ఞనిచ్చారు.

విద్యార్థులలో వినయవిధేయతలు, పురుషార్థము, నైతిక విలువలును పెంపొందించుటకు గాను ఈ పుస్తకము ఎంతో సహాయకారికాగలదు. ఈ నమ్మకంతోనే ఈపుస్తకాన్ని నెలవారీ పరీక్షలకొరకు విద్యార్థులకందించుచున్నాము. దీని సఫలత మీ విద్యార్థులమీదనే ఆధారపడి వుంది.

పారస్ జైన్,
ప్రధాన కార్యదర్శి,
ఆంధ్రప్రదేశ్ భగవాన్ మహావీర్
2500 వ నిర్వాణ సమారోహ
సమితి.

హైదరాబాదు,
26-8-75.

నేటికి దాదాపు 2500 సంవత్సరాల నాటి ముందు కథ

ఒకతోట. చాలామంది బాలబాలికలు ఆడుకుంటున్నారు, గంతులేస్తున్నారు. కిలకిలామని నవ్వుతున్నారు. ఉన్నట్లుండి అందరు భయాక్రాంతులై, బొమ్మలవలె నిలబడి పోయారు. ఏమయింది? ఒక చెట్టుమాను వద్ద పెద్ద నల్లత్రాచు బుసలు కొడుతూ కనిపించింది. అమ్మో! మరుక్షణాన అందరూ పారిపోసాగారు. కాని ఒక కుర్రవాడు మాత్రం పారిపోలేదు. తన స్నేహితులతో "ఓస్, ఇంతమాత్రానికే భయపడి పారి పోవాల్నా? ఇది మామూలు పాము. మనం మనుష్యులం కదా! చూడండి, నేనేం చేస్తానో" అని మెల్లగా ఆ పాము దగ్గరకు వెళ్ళాడు. దాన్ని జాగ్రత్తగా పట్టుకొని, దూరంగా తీసుకెళ్ళి వదిలిపెట్టి వచ్చాడు. "మిత్రులారా! భయమనేది మానవుడికి భయంకర శత్రువు. మన మనస్సులలో భయం ప్రవేశించిందంటే, అందరూ మనలని భయపెడ్తారు. కనుక మనం ఎప్పటికి భయపడకూడదు. నిర్భయంగా ఉండడం నేర్చుకోండి" అని ఆ బాలకుడు తన మిత్రులకు ఉద్బోధించాడు. మిగతా పిల్లలు అతని సాహసాన్ని చూసి విస్తుపోయారు. తమ తమ ఇండ్లకు వెళ్ళి ఆ సాహస కృత్యాన్ని గురించి తల్లిదండ్రులకు చెప్పారు. అందరూ ఆ మహావీరుణ్ణి చూడడానికి వచ్చారు. ఆ మహావీరుడు ఎవరో కాదు. ఆ నగరానికి రాజైన సిద్ధార్థుని పుత్రుడైన వర్ధమానుడు. పువ్వుపుట్టంగానే పరిమళిస్తుందన్నట్లు మహా పురుషులు బాల్యంనుండి కూడా అతిలోక సాహసాన్ని ప్రదర్శిస్తూఉంటారు.

ఈ సాహసకృత్యం చేసింతరువాత ఆబాలుడు మహావీరుడనే పేరుతో ప్రసిద్ధికెక్కాడు.

మహావీరుడి అసలు పేరు వర్ధమానుడు. ఆయన కాశ్యప గోత్రానికి చెందిన జ్ఞాతృక సిద్ధార్థుని పుత్రుడు. సిద్ధార్థుడు కొల్లాగ నగరానికి ప్రభువు. విశాలనగరానికి చెందిన త్రిశలాదేవి ఆయన భార్య. వారి ప్రథమసంతానం - నందివర్ధనుడు. నందివర్ధనుని తరువాతవాడే వర్ధమానుడు.

త్రిశలాదేవి గర్భవతిగా ఉన్నరోజులలో సిద్ధార్థునిరాజ్యం మూడు పువ్వులు ఆరు కాయలుగా అభివృద్ధి చెందసాగింది. ఈ అభివృద్ధిని చూసి రాజు తనకు పుట్టబోయే పుత్రుడికి 'వర్ధమానుడు' అని పేరు పెట్టాలని నిశ్చయించాడు.

ఈ విధంగా నవమాసాలు నిండాయి. ఆ నాడు చైత్రశుద్ధ త్రయోదశి. మకరలగ్న శుభసమయాన త్రిశలాదేవి లోకకళ్యాణకరుడైన శిశువును కన్నది.

వర్ధమానుడు ఇరవైనలుగురు తీర్థంకరులలో చివరివాడు. తీర్థంకరులనగా ఇంద్రియాలను జయించి, ఆత్మ కళ్యాణాన్ని సాధించినవారు. అట్టివారు సమస్త ప్రజలను దుఃఖవిముక్తులను చేసి, ధర్మతీర్థ క్షేత్రాలుగా వెలుగొంది, మానవాళికి మార్గదర్శకులవుతారు. అందుచేతనే సమంత భద్రాచార్యుడనే మహాత్ముడు తీర్థంకరులు సర్వోదయతీర్థాలవంటివారనిఅన్నాడు.

తీర్థంకర పదవిని పొందడానికి మానవుడు జన్మజన్మాంతరాలుగా, వేలు, లక్షల సంవత్సరాలు దృఢసంకల్పంతో, నిరంతర కృషి చేయాల్సి ఉంటుంది. పూర్వజన్మ సంచిత పాపాన్ని నాశనం చేసుకొని, అంతరంగికమైన అజ్ఞానాన్ని పారద్రోలి, కైవల్య జ్ఞానం (బోధి) పొందడానికి యోగ్యత సంపాదించుకోవాల్సి ఉంటుంది. అప్పుడే ఆ జీవుడు తీర్థంకరుడుగా వెలుగొందుతాడు.

శ్రీ వర్ధమానమహావీరుని 27 పూర్వ జన్మలనుగురించి ధర్మశాస్త్రాలలో వ్రాయబడిఉంది. ఈ 27 జన్మలలో ఆ జీవుడు పాపరహితుడై, ఉత్తమ ఆచరణ, ఉత్తమ జ్ఞానం పొంది, సత్యం, అహింసల ప్రచారానికి యోగ్యత సంపాదించి, అంతిమ తీర్థంకరుడైన భగవాన్ వర్ధమాన మహావీరుని రూపంలో అవతరించాడు.

2

చిన్నతనంనుండి మహావీరుడు అద్వితీయ ప్రతిభ కలిగి, తోటి బాలురకంటే మిన్నగా ఉండేవాడు. సుందరంగా, ఆకర్షణీయంగా ఉండే శరీరం, శాంత గంభీర స్వభావం కలిగి, జనముద్దుగా ఉండేవాడు. ఆయన తన ఎనిమిదవ ఏటనే నేను సమస్త జీవులపట్ల దయకలిగి ఉంటాను. ఎప్పుడూ సత్యమే పలుకుతాను, దొంగతనం చేయను, మంచి ప్రవర్తన కలిగి ఉంటాను, అని నిశ్చయం చేసుకున్నాడు.

అందరు బాలకులలాగానే మహావీరుణ్ణికూడా తల్లిదండ్రులు పాఠశాలకు పంపించారు. పూర్వజన్మ సంస్కార ప్రభావంవల్ల ఆయన అన్ని విద్యలు అల్పకాలంలోనే నేర్చుకున్నాడు.

ఒకరోజున మహావీరుణ్ణి పరీక్షించడానికి ఇంద్రుడు వృద్ధవేషం ధరించివచ్చాడు. గురువుగారిని చూచి 'ఓ ఆచార్యా! నేను కొన్ని ప్రశ్నలకు సమాధానం దొరక్క దేశమంతా తిరుగుతున్నాను. తమరు ఆ ప్రశ్నలకు సమాధానం చెబుతారేమోనని వచ్చాను' అని అన్నాడు. వ్యాకరణానికి సంబంధించిన ఆప్రశ్నలకు సమాధానం తెలియక గురువుగారు దిక్కులుచూడసాగారు. అప్పుడు వర్ధమానుడు వినమ్రభావంతో తనగురువు

గారిదగ్గరకు వెళ్ళి, 'అయ్యా! తమరు ఆజ్ఞాపిస్తే, ఈ ప్రశ్నలకు నేను సమాధానం చెప్పగలను' అన్నాడు. వర్ధమానుని అసాధారణ ప్రతిభను గుర్తించిఉన్న ఉపాధ్యాయుడు అలాగే చేయమన్నాడు.

ఆ వృద్ధ వ్యక్తి అడిగిన ప్రశ్నలన్నిటికీ, జంకూ-గొంకూ లేకుండా, మహావీరుడు యుక్తియుక్తంగా జవాబులు చెప్పాడు. ఆ జవాబులు విని, అక్కడ ఉన్నవారందరు ఆశ్చర్య చకితులయిపోయారు. ఆ బాలకుడి బుద్ధి ప్రతిభలను ఎంతగానో మెచ్చుకున్నారు.

జటిలమైన వ్యాకరణ సంబంధాలయిన విషయాలను మహావీరుడు ఎంతోసరళంగా, అందరికి సులభంగా అర్థం అయ్యేట్లు విడమర్చి చెప్పాడు. తరువాత ఆ విషయాలు ఆధారంగా "జినేంద్ర వ్యాకరణం" రచించబడ్డది.

అప్పుడు ఆ ముసలివ్యక్తి తన స్వరూపం ధరించి, "ఓ మహానుభావా! నీలో దాగిఉన్న జ్ఞానజ్యోతిని ప్రకాశింప చేయడానికే, నేను ఈ విధంగా చేశాను. నన్ను క్షమించు"మని మహావీరుణ్ణి స్తుతించి, తన లోకానికి వెళ్ళిపోయాడు.

ఈ సంఘటన తరువాత రాజకుమారునికి తనుచెప్పేవిద్య ఏమీ లేదని, ఆయన స్వయంబుద్ధుడని నిశ్చయించుకొని, ఉపాధ్యాయుడు, బాలకుణ్ణి వెంటబెట్టుకొని రాజుగారిదగ్గరకు వెళ్ళి, అన్ని విషయాలు చెప్పి, క్షత్రియోచిత విద్యలు నేర్పించమన్నాడు.

3

ఒకరోజు సాయంకాలం మహావీరుడు తన స్నేహితులతో వన విహారం చేయడానికి బయలుదేరాడు. ఆకాశంలో

కొంగలు బారులుకట్టి ఎగురుతున్నాయి. ఒక కొంగను కింద పడవేద్దామని ఒకమిత్రుడు బాణం ఎక్కుపెట్టాడు. అదిచూచి, వర్ధమానుడు అతణ్ణి నివారిస్తూ ఇలా అన్నాడు. "మిత్రుడా! ఏం చేయబోతున్నావు? ఆనందంగా స్వేచ్ఛగా విహరిస్తున్న ఒక ప్రాణి జీవాలు తీయడానికి సిద్ధపడ్డావా? అది నీకు ఏం అపకారం చేసింది? నీవు ఒక జీవికి ప్రాణం పొయ్యగలవా? ప్రాణం పొయ్యలేనివాడివి, ప్రాణంతీయ పూనుకోవడం తప్పు కాదా! మనం పశుబలంచే వేలమంది ప్రాణులను చంపగలం కాని ఒక చిన్న చీమకైనా ప్రాణం పోయలేము. కనుక ప్రాణం పోయలేనివాడికి, ప్రాణంతీసే అధికారం కూడా లేదు. ఇతరులను హింసించడం మహాపాపం. ఇతరులకు ఆనందం కలిగించడంలోనే మానవుని గొప్పతనం వెల్లడి అవుతుంది." అని హితబోధ చేసి, వారి హింసాప్రవృత్తిని మాన్పించాడు.

క్షత్రియవంశంలో పుట్టినా, వర్ధమానుడు జాలిగుండె కలవాడు. ఒకసారి ఆయన నగరంలోని యజ్ఞశాలకు వెళ్లాడు. అక్కడ యజ్ఞవేదిక బలి ఇవ్వబడిన పశువుల రక్తంతో తడిసి, ఎర్రగా కనిపించింది. ఆ దృశ్యాన్ని చూసి, వర్ధమానుని హృదయం కరిగిపోయింది. అక్కడ ఉన్నవారితో ఆయన ఇలా అన్నాడు. "యజ్ఞాలలో పశుబలి ఇచ్చినందు వలన స్వర్గం లభించదు. పశువులను వధించడంకంటే, మన మనస్సులలో కల రాగద్వేషాలను నశింపచేయాలి. అహింసాప్రవృత్తిని అవలంబించి, పరోపకారభావంతో కూడిన ఉత్తమ ఆచరణవల్లనే స్వర్గం లభించకలము". ఇలా హితబోధచేసి ఆయన వారిచేత హింసాపూర్ణమైన పశుబలిని మాన్పించాడు.

శత్రువులను జయించి, తమ రాజ్యాన్ని విస్తరింపచేసుకోవడమే ఆకాలంలో క్షత్రియుల కర్తవ్యంగా ఉండేది.

రాజ్యవిస్తరణకై క్షత్రియులు దండయాత్రలు చేసేవారు. ఆ యుద్ధాలలో వారు మానవత్వాన్ని మరిచిపోయి, దయాదాక్షిణ్యాలు లేక, కోటిమానవుల్ని సంహరించేవారు. ఈ హింసా ప్రవృత్తిని చూచి, వర్ధమానుడు ఎంతగానో బాధపడేవాడు "యుద్ధం మానవత్వానికి లక్షణమా? దీనికి అంతం ఏమిటి? పెద్దచేప, చిన్న చేపలను మింగితే, ఆ పెద్దచేపను మరో పెద్దచేప మింగడంలేదా? అదేవిధంగా మానవుడు తనకంటే బలహీనుణ్ణి సంహరించడం ఏం న్యాయం? ఇదే పరాక్రమమా? శౌర్యమా? కాదు. మానవుడి పరాక్రమము, శౌర్యము, శక్తి సామర్థ్యాలు దుర్బలులను రక్షించడానికే ఉపయోగపడాలి". ఇలా ఆలోచించి ఆయన క్షత్రియులలో ఉండే యుద్ధాసక్తిని అసహ్యించుకొని, యుద్ధాలను నివారించడానికి ప్రయత్నం చేసేవాడు.

4

ఈ విధంగా క్షత్రియులకు పనికిరాని అహింసాప్రచారం చేస్తూ, ఎప్పుడూ ఏవో ఆలోచనలో మునిగిఉండే వర్ధమానుడి వింతప్రవర్తన చూసి, తల్లితండ్రులు ఈవిధంగానే ఉంటే, కొంతకాలానికి తమపుత్రుడు సర్వస్వం త్యజించి, సన్యసిస్తాడేమోనని భయపడ్డారు. అందుచేత వివాహం చేస్తే, లోకధ్యాసలో పడతాడని అనుకొని, వర్ధమానుడి స్నేహితులతో వివాహానికి ఒప్పించమని అడిగారు. కాని స్నేహితులు వర్ధమానుణ్ణి పెండ్లికి ఒప్పించలేకపోయారు. అప్పుడు త్రిశలాదేవి తానే స్వయంగా పుత్రుడి వైరాగ్యభావం పోగొట్టాలని వర్ధమానుడి వద్దకు వచ్చింది. తనతల్లి దీనంగా ఉండడం చూచి, వర్ధమానుడికి చాలావిచారం కలిగింది. 'అమ్మా! మీరు ఏది కావాలంటే అదిచేస్తాను. నేను ఉండగా మీరు విచారించడం దేనికి? నేను ఎన్నడూ మీకు దుఃఖం కలిగించను. తల్లి

తండ్రులసేవయే భగవత్సేవ. ఆజ్ఞాపించండి'' అని అన్నాడు. త్రిశలాదేవి తనకుమారుడి వినయభావానికి ఆనందించి ఇలా అన్నది. ''నాయనా! నీవు వివాహం చేసుకోవాలని, మేము జీవించి ఉన్నంతవరకు నీవు మాకండ్లెదుటనే ఉండాలని మేము కోరుకుంటున్నాము. సన్యసించి నీవు మాజీవితాలను కంటకప్రాయం చేయవద్దు". మాతృభక్తి కల వర్ధమానుడు 'అమ్మా! నీకోరిక తప్పకుండా తీరుస్తాను. తల్లితండ్రులకు బాధ కలిగించకుండా, వారి ఇష్టానుసారం జీవించడమే పుత్రుల కర్తవ్యం.' అని అన్నాడు. కొడుకు మాటలు విని త్రిశలాదేవి ఎంతగానో సంతోషించింది.

5

ఈ ప్రకారం వర్ధమానుడు 28 సంవత్సరాల ప్రాయం కలవాడయినాడు. అతివృద్ధులయిన సిద్ధార్థుడు, త్రిశలాదేవి జైన సంప్రదాయం ప్రకారం దీక్షవహించి, పార్శ్వనాథుని నామం జపిస్తూ, నిరశనవ్రతంతో ఆత్మను పరిశుద్ధమొనర్చుకొని, శరీరత్యాగం చేశారు.

తల్లితండ్రులు స్వర్గస్థులయిన తరువాత వర్ధమానుడు ప్రపంచాన్నీ, భోగవిలాసాలన్నీ త్యజించి, దీక్షావ్రతం గ్రహించడానికి ఎట్టి అడ్డంకు ఉండబోదనుకున్నాడు. కాని అన్నగారయిన నందివర్ధనుడు తమ్ముణ్ణి వదలిఉండలేక, ఇంకాకొంతకాలమయినా తనవద్ద ఉండమని కోరాడు. పెద్దల అనుమతి పొందకుండా, దీక్షాధారణ చేయకూడదు కనుక వర్ధమానుడు ఇంకా కొంత కాలం అన్నగారి అండదండలలో ఉందామని నిశ్చయించుకున్నాడు. ఈ విధంగా రెండు సంవత్సరాలపాటు నిర్లిప్తంగాను, వైరాగ్యభావంతోను జీవితంగడిపాడు. అప్పటికి వర్ధమానుడికి

30 సంవత్సరాల ప్రాయం వచ్చింది. ఆయన తన సర్వస్వం త్యాగంచేసి, అన్నగారి అనుజ్ఞ పొంది, దీక్షాధారణకై బయలు దేరాడు.

మార్గశిరమాస శుద్ధదశమినాడు, వర్ధమానమహావీరుడు జ్ఞాతృనామక ఉపవనంలో, అశోకవృక్షంక్రింద కూర్చొని తన శరీరంమీదఉన్న ఆభరణాలు, రాజవస్త్రాలు విసర్జించాడు. అక్కడ రెండురోజులు పూర్తిగా ఉపవాసంచేసి, మహావీరుడు సిద్ధమహాపురుషులకు నమస్కరించి, అన్ని పాపకర్మలను వదలివేసి, త్రికర్తృచారిత్రికధర్మాన్ని స్వీకరించాడు. ఈ విధంగా దీక్షావ్రతాన్ని గ్రహించిన తరువాత కష్టాలు సహించినందువల్లనే పాపకర్మలు నశిస్తాయని, చిత్తశుద్ధి లభిస్తుందని ఆయన పెక్కు రకాల కష్టాలను ఎదుర్కొంటూ, సాధనచేశాడు.

సాధనదశలో ఆయన అన్నపానీయాలను విసర్జించి, దేశసంచారంచేస్తూ, తపస్సు చేయసాగాడు. ఒక రోజున, ఒక గ్రామం బయటి భాగంలో, చెట్టుక్రింద కూర్చొని ధ్యాననిమగ్నుడై నాడు. అప్పుడు ఆయనకు శరీరధ్యాసలేదు. ఆ సమయంలో ఒక రైతు తనపశువులను అక్కడ వదలి, మహావీరుణ్ణి వాటిని చూస్తూ ఉండమని చెప్పి, పనిమీద ఊళ్ళోకి వెళ్ళాడు. ధ్యాన నిమగ్నుడైన మహావీరుడికి ఆ సంగతి ఏమాత్రం తెలియదు. అక్కడ వదలిపెట్టబడిన పశువులు తమదోవన అవి వెళ్ళిపోయాయి. ఆ రైతు కొంతసేపటికి తిరిగివచ్చి, తన పశువులు కనబడక పోవడంతో, భయపడి మహావీరుణ్ణి అడిగాడు. మహావీరుడు తపస్సమాధిలో నిమగ్నుడై ఉండడంతో ఏమీ జవాబు చెప్ప లేదు. తన పశువులు కనబడకపోవడమూ, ఆమునిపి జవాబు చెప్పకపోవడంతో ఆ రైతుకు మహాకోపంవచ్చింది. మహావీరుడే పశువులను తరిమివేసి ఉంటాడని, తన చేతిలోని చెర్నాకోలతో,

మహావీరుణ్ణి కొట్టసాగాడు. కాని ఆశ్చర్యం! ధ్యాననిమగ్నుడైన మహావీరుడిలో ఎట్టి చలనం కన్పించలేదు. దాంతో తనుచేసిన తప్పును గుర్తించి, ఆ రైతు పశ్చాత్తాపంపొంది, మహావీరుడికి నమస్కరించి, క్షమాపణకోరి, తనదోవన వెళ్ళి పోయాడు.

సుఖదుఃఖాలను సమంగా గ్రహించే సామర్ధ్యంకల ఆ మహా పురుషుడు ఈవిధంగా అనేకసంవత్సరాలపాటు అనేకకష్టాల ననుభవించాడు. కర్మలను అనుభవిస్తే గాని కర్మమోక్షం అయి సాధనామార్గంలో విజయం లభించదనే భావంతో ఆయన అనార్యులు ఉండే ప్రదేశాలలోకూడా విహరించాడు. అక్కడి అసభ్య జాతులవారు ఆయనను అనేకవిధాలుగా హింసించారు. నోటికి వచ్చిన దుర్భాషలాడారు. రాళ్ళు విసిరారు. కర్రలతో కొట్టారు. కాని ఆమహానుభావుడు దేనికి చలించలేదు.

వనదేవతలు ఆయనను కామమోహితుణ్ణి చేద్దామని ప్రయత్నించారు. కాని ఆయన ఏమాత్రం చలించలేదు.

6

ఒకసారి ఆయన మోరాక ప్రదేశంలోకల ఒక అడవికి చేరుకున్నారు. అక్కడ ఒకమునిఆశ్రమం వుంది. ఆముని శిష్యులు కూడా అక్కడనే దగ్గరదగ్గరగా కుటీరాలలో నివసిస్తూవున్నారు. ఆముని సిద్ధార్థమహారాజుకు స్నేహితుడు కావడంతో, మహా వీరునికి స్వాగతంచెప్పి, ఆయన వుండడానికి ఒకకుటీరం ఏర్పాటు చేశాడు. మహావీరుడు నిర్లిప్త భావంతో అక్కడవుండి తపో నిమగ్నుడై కాలంగడపసాగాడు.

ఆసంవత్సరం వర్షాలు బొత్తిగా కురవలేదు. పశువులకు తినడానికి గడ్డికూడా లభ్యంకాలేదు. దాంతో ఒకరోజున కొన్నిపశువులు తమకడుపులు నింపుకోవడానికి, ఆశ్రమంలోని

కుటీరాలపై కప్పిన రెల్లుగడ్డిని తినసాగినయ్. తాపసులు తమ తమ కుటీరాలవద్దకు వచ్చిన పశువులను తరిమివేశారు. ఆపశువులు మహావీరుడున్న కుటీరంపైన వున్నగడ్డిని పూర్తిగా తినివేశాయి. కాని మహావీరుడికి యిదేంపట్టలేదు. ఈసంగతి తెలుసుకొని ఆఆశ్రమానికి పెద్దఅయిన ముని అక్కడకువచ్చి మహావీరుణ్ణి చీవాట్లుపెట్టసాగాడు. దాంతో ఆస్థానం ధ్యానానికి అనుకూలంగాలేదని, మహావీరుడు ముందుకుసాగాడు.

ఒకపర్యాయం వాచాలప్రాంతంనుండి మహావీరుడు శ్వేతాంబరనగరానికి బయలుదేరాడు. ఒకచోట మార్గం రెండుగా చీలింది. ఏమార్గం గుండా పోవాలి అని ఆలోచిస్తూ ఆయన అక్కడనిలబడి పోయాడు. అప్పుడుఅక్కడ ఒక్కగొల్లపిల్లవాడు నిలబడి "అయ్యా! ఈ కుడివైపునవున్నమార్గం దగ్గరి మార్గం. కాని ఈ మార్గంలో ఒక భయంకరమైనసర్పం వున్నది. అది చూచిందంటేనే శరీరంలో విషం వ్యాపిస్తుంది. అందుచేతనే దానిని 'దృష్టివిషసర్పము'ని అంటున్నారు. మనుష్యులే కాదు, పశుపక్ష్యాదులుకూడా ఆవైపు వెళ్ళవు. వెళ్ళినవాడు ప్రాణాలతో తిరిగివచ్చినట్లు దాఖలాలేదు. కాబట్టి ఈమార్గంగుండా వెళ్ళిఅపాయంలో తలదూర్చవద్దు". అని అన్నాడు.

మహావీరుడు మనఃపర్యాయజ్ఞానం ద్వారా ఈసర్పం పూర్వజన్మలో ఎవరోగొప్పవ్యక్తి అని, ఏదోపాపంవల్ల అతనికి ఈజన్మలభించిందని గుర్తించి, ఈజన్మతోనైనా అతనిని సన్మార్గంలో పెట్టాలని నిశ్చయించుకున్నాడు. ఆయన అదేమార్గాన బయలుదేరాడు. వెళ్ళివెళ్ళి ఆసర్పం వున్నచోటనే ధ్యాననిమగ్నుడై నిలబడ్డాడు. కొద్దిసేపటి తరువాత ఆసర్పం తనపుట్ట నుండి బయటికివచ్చి, ఆవ్యక్తిని చూసింది. శాంతంగా,

సుస్థిరంగా నిలబడివున్న ఆవ్యక్తినిచూసేటప్పటికి, సర్పానికి మహాకోపం వచ్చింది. అది మహావీరుడివద్దకువచ్చి, భయంకరంగా బుసలుకొట్టింది. దానిబుసల మూలంగా అక్కడివాతావరణమంతా నల్లగా మారిపోయింది. చుట్టుపట్లవున్న పచ్చటిచెట్లన్నీ నల్లగా మాడిపోయాయి. కాని మహావీరుడు ఏమాత్రం చలించలేదు. ఆసర్పం మహావీరుడి కాలిమీద కాటువేసింది. దాని మూలంగా కూడా మహావీరుడు చలించలేదు.

తనవిషంమీద ఆసర్పానికి మహాగర్వంగా వుండేది. కాని మహావీరునిముందు దానికి గర్వభంగం అయింది. ఇంతజరిగినా, మహావీరుడిలో ఏమాత్రం మార్పురాకపోవడంతో దానికి యింకా ఆశ్చర్యం కలిగింది. మహావీరుడు కరుణ, దయ, అహింస, శాంతి మొదలగు గుణాలు మూర్తీభవించినవాడు కనుక ఆయన మనస్సులోఆసర్పం పట్ల ఎటువంటి కోపం, ద్వేషం కలగలేదు. దాంతో ఆసర్పం మనస్సులో గొప్పమార్పు కలిగింది. తనదుష్కృత్యాలకు పశ్చాత్తాపపడి, ఆసర్పం ఆయన కాళ్ళమీదపడి పొర్ల సాగింది. మెల్ల మెల్లగా ఆసర్పం మనస్సులోని దుష్టప్రవృత్తులన్నీ నశించిపోయినయి. భగవానుడి కాళ్ళమీదపడి క్షమాపణ వేడుకోసాగింది. మహావీరుడు అత్యంత ప్రసన్నుడై, ఆసర్పానికి సన్మార్గోపదేశంచేసి, ముందుకు సాగాడు. పూర్వజన్మలో ఆసర్పం పేరు చండకౌశికుడు.

7

సంగముడనే దేవత మహావీరుణ్ణి ఎలాగైనా ఓడించాలని నిశ్చయించుకున్నాడు.

ఒకసారి మహావీరుడు కోలాసచైత్యంలో ధ్యాననిమగ్నుడై ఉన్నాడు. సూర్యాస్తమయ్యేటప్పటికి భయంకరమైనతుఫాను వచ్చింది. తుఫానుతో ఇసుకకూడా ఎగిరివచ్చింది. ఆఇసుక మహావీరుడి చెవుల్లో, ముక్కులో దూరింది. కాని

మహావీరుడి ధ్యానంలో ఎట్టిమార్పు రాలేదు. కొద్ది సేపటికి తుఫాను ఆగిపోయింది. కాని కొన్ని అశుభచీమలు బిలబిలావచ్చి మహావీరుడి శరీరాన్ని చుట్టుముట్టాయి. అవి మహావీరుడి శరీరాన్ని తూట్లు పడచేసాయి. చీమల తరువాత ఆ సెటీగల సముదాయం, దోమలగుంపులు వచ్చి మహావీరుని శరీరంలోని రక్తాన్నంతా పీల్చివేసాయి.

ఈ విధంగా ఎన్నోపిశాచచేష్టలు చేసినా మహావీరుడి ధ్యానంలో ఎలాంటిమార్పు రాలేదు. సంగమదేవుడు పరిపరి విధాల పరీక్షించినా, మహావీరుడు ఏమాత్రం చలించక, ధ్యానాన్ని వీడక స్థిరచిత్తంతో నిలబడ్డాడు. ఆ విధంగా ఆరుమాసాలవరకు అతడు ఆహారపానీయాలు విడచి ధ్యాన నిమగ్నుడై ఉండి, తనస్థైర్యాన్ని ప్రదర్శించాడు. అదిచూచి సంగమదేవుడు తానోడిపోయినట్లు నిశ్చయించుకొని, తిరిగి స్వర్గానికి వెళ్ళిపోదామని నిశ్చయించుకున్నాడు.

అప్పుడు ఉన్నట్లుండి మహావీరుడి కండ్లనుండి నీళ్లు కారసాగాయి. అదిగమనించి సంగమదేవుడు ఆశ్చర్యపడి "మీ నేత్రాలనుండి కన్నీరు కారడానికి కారణం ఏమిటని" అడిగాడు.

అప్పుడు మహావీరుడు కండ్లు తెరిచి "సంగమా! బాధలకు భయపడి, వేదన కారణంగా నేను కన్నీరు కార్చడంలేదు. లోగడ నన్నుచాలామంది అనేక విధాలుగా బాధించి, చివరకు విసుగుచెంది, నన్నుక్షమార్పణ కోరుకునే వెళ్ళిపోయారు. కాని నీవుమాత్రం క్షమాభిక్ష కోరకుండానే వెళుతుంటే చూచి నాకు నీపై జాలికలిగింది. నీపై కలిగినకరుణ మూలంగానే నాకు కన్నీరువచ్చింది". ఆమాటలు విని సంగమదేవుడు సిగ్గుపడి,

మహావీరునికి సాష్టాంగనమస్కారముచేసి, క్షమాభిక్ష వేడుకొని, స్వర్గానికి వెళ్ళిపోయాడు.

8

దీక్షను స్వీకరించినతరువాత నానావిధాలయిన కష్టాలు, ఆపదలు, సర్ప, అగ్ని, జలాదిభయాలు, రాజదండనలు అనుభవించి, మహావీరుడు తన పూర్వకర్మలనన్నింటిని నశింపచేసుకున్నాడు. సుఖాన్ని కోరుకుని మానవుడు సాంసారిక బంధనాలలో చిక్కుకొని, పుడుతూ-చస్తూ, నరకబాధలనుభవిస్తూ ఉంటాడని, దుఃఖాలు, బాధలు అనుభవించి, ప్రాపంచిక బంధాల నుండి విముక్తుడై పరమాత్మపదం చేరుకుంటాడని ఆయన తన అనుపమానధైర్యం, త్యాగం, సంయమశక్తివల్ల నిరూపించాడు. దుఃఖం ఆత్మానుశీలానికి మూలమని, వివేకాన్ని, సుబుద్ధిని కలిగిస్తుందని మహావీరుడు ఉపదేశించాడు.

ఈ అవధిలో ఆయన కఠోర సాధనవలన 28 మహాత్తర గుణాలతో విభూషితుడయి, కైవల్యజ్ఞానప్రాప్తికి యోగ్యత సంపాదించాడు.

వైశాఖశుక్లదశమినాడు మహావీరుడు జృంభకమనే పేరుగల గ్రామం బయటిభాగంలో, ఋజు-బాలుకా నదీతీరంలో, ఒక సాలవృక్షంక్రింద ధ్యాన నిమగ్నుడై ఉన్నాడు. మంటలు కక్కుతున్న ఎండ, వడగాలిని లెక్కపెట్టక ఆయన అత్యుసిద్ధికై తపస్సుతో లీనమైఉన్నాడు. ఆరోజురాత్రి రెండుఘడియలసేపు ఆయనకు దివ్యమైననిద్ర వచ్చింది. ఆ నిద్రలో ఆయనకు భావితీర్థంకరపదాన్ని సూచించే పది కలలు వచ్చాయి. ఆతరువాత మేల్కొనగానే ఆయనకు కైవల్యజ్ఞానం ప్రాప్తించింది. దాంతో వారి కఠోర పరీక్ష—సాధన—తపశ్చర్య పూర్తి

అయింది. కైవల్యజ్ఞానం ప్రాప్తించగానే వారి శరీరం మేలిమి బంగారు ఛాయలతో మిరుమిట్లుకొలుపసాగింది. నలువైపులా ప్రకృతి కూడా ప్రసన్నమై, వసంతశోభలతో నిండారింది.

కైవల్య జ్ఞానప్రాప్తితో మహావీరుడు తీర్థంకరుడై సర్వజ్ఞుడు, సర్వదర్శి అయినాడు. ఆయన తనకు లభించిన జ్ఞానంతో ప్రజలలో జాగృతిని కలిగించి, వారిని తన ఉపదేశాల ద్వారా ఆత్మకళ్యాణమార్గంలో ప్రవృత్తులను చేయాలని నిశ్చయించుకున్నాడు. ఆయన తన అమృతంలాంటి వాక్కులతో సమస్తప్రజలకు ఆత్మకళ్యాణం కలిగిస్తూ, తన ఉపదేశాలద్వారా వారిని ఉద్ధరిస్తూ దేశాటనం చేయసాగాడు. ఆయన ఏఊళ్ళో ఒక్కరోజుకంటే ఎక్కువ ఉండకుండా ధర్మప్రచారం చేశాడు.

మహావీరుడు సమస్తజీవులకు హితం—మేలు కలిగించే సిద్ధాంతమే నిజమైన ధర్మమని ఉద్బోధించాడు. సత్యంద్వారా సత్స్వరూపజ్ఞానంపొంది, ఆ సత్యం ద్వారా పరమానందాన్ని అనుభవించమని చెబుతూ ఆయన సాత్త్విక ప్రేమ ప్రధానమయిన అహింసను ప్రచారం చేశాడు. ఆ కాలంలో ధర్మంపేరిట జరుగుతున్న అన్యాయాలను, దురాచారాలను అరికట్టి, సర్వసమతావాదాన్ని ప్రచారంచేశాడు. ఆయన కులం, గోత్రం, ధర్మం, మతం, ధనం—హోదా మొదలగువాటిని లెక్కచేయకుండా సమస్త ప్రజలకు దుఃఖ నివారణ మార్గాన్ని ఉపదేశించి, అందరికి శాంతిని ప్రసాదించాడు.

9

కేవల జ్ఞానప్రాప్తితరువాత భగవాన్ మహావీరుడు మొట్టమొదటిసారిగా 'అపాపా' నగర బాహ్యప్రదేశంలో సమవసరణం (ఉపదేశం) చేశారు. ఆ రోజుల్లో ఆ నగరంలో

గొప్పయజ్ఞం జరుగుతుండేది. ఇంద్రభూతి, అగ్నిభూతి, వాయుభూతులనే మహాపండితులు ఆ యజ్ఞాన్ని నిర్వహిస్తుండేవారు. వారు ముగ్గురు మహావీరుణ్ణి వాగ్వివాదంలో ఓడిద్దామని వచ్చి, చిత్తుగా ఓడిపోయి, మహావీరుడి ప్రముఖ శిష్యులై పోయారు. వారితోపాటు వారి శిష్యులందరూ మహావీరుడి శిష్యులై పోయారు. ప్రధాన శిష్యులను గణధరు లంటారు. భగవాన్ మహావీరుడి ఉపదేశాలను పుస్తకబద్ధం చేసిన గౌరవం ఇంద్రభూతి గౌతముడికి లభించింది.

భగవాన్‌మహావీరుడు ఆసమయంలో చతుర్విధసంఘాన్ని (తీర్థాలు) సాధు, సాధ్వీ, శ్రావక, శ్రావిక సంఘాలను—స్థాపించాడు.

సంసార బంధాలలో ఉంటూకూడా, జీవుడు ముక్తి సాధనకై ప్రయత్నించవచ్చును. గృహస్థు ఒక్కరోజులో ఇంద్రియ నిగ్రహాన్ని సాధించి, ప్రపంచాన్ని త్యజించి, సమగ్ర ధర్మ స్వరూపాన్ని పొందలేడు. కనుక శ్రీ మహావీరుడు గృహస్థులకు ఉదారమైన, సులభమైన నియమాలను ప్రతిపాదించాడు.

సంఘస్థాపన చేసిన తరువాత, ధర్మ సిద్ధాంతాల ప్రచారం చేస్తూ, మహావీరుడు విహారం (దేశాటన) చేశాడు. ఆగిన చోట్లలో దుఃఖపీడితులైన ప్రజల దుఃఖాలను పోగొడుతూ వారికి శాశ్వత సుఖసాధన మార్గం ఉపదేశించాడు. భగవాన్ మహావీరుడి ఉపదేశామృతంతో అనేకమంది—స్త్రీ పురుషులు—ఆత్మకళ్యాణ మార్గాన్ని గుర్తించి, మోక్షసాధనకు ఉపక్రమించారు.

10

ఒకసారి కౌశాంబినగరం బయటఉన్న చంద్రావతరణం అనే ఉద్యానవనంలో మహావీరుడు ధర్మసభలో ఉపదేశం

ఇస్తున్నారు. ఉపదేశానంతరం వచ్చినవారంతా వెళ్ళిపోయారు. కాని రాణిజయంతి మాత్రం నిలబడే ఉండిపోయింది. ఆమె మనస్సులో కొన్నిసందేహాలుండిపోయాయని గ్రహించి, మహావీరప్రభువు ఆమెను దగ్గరకు పిలిపించి, సందేహాలు ఏమిటని అడిగాడు. రాణిజయంతి ప్రశ్నలకు వారు ఈ క్రిందివిధంగా జవాబులిచ్చారు.

ప్రశ్న : హే భగవాన్! ఈజీవితము భారస్వరూపంగా ఎందుకు అవుతుంది?

మహావీరుడు : హింస, అసత్యం, దొంగతనం మొదలైన ఎనిమిది పాప కార్యాలలో మనస్సు లగ్నం అయి ఉండడం చేత జీవితం భారస్వరూప మవుతుంది.

ప్రశ్న : హే మహాత్మా, మేలుకొని ఉండడంమంచిదా? లేక నిద్రిస్తూ ఉండడం మంచిదా ?

మహా : రెండూ మంచివే.

ప్రశ్న : అది ఎలా కుదురుతుంది భగవాన్ ?

మహా : చెడుబుద్ధులు కలిగి, చెడుమార్గంలో సంచరిస్తూ, అజన్మాంతం అధర్మకార్యాలు చేసేవారు నిద్రించిఉండడమే మంచిది. ఎందుకనగా వారు నిద్రలో పాపకార్యాలు చేయరుకదా! అతని నిద్రవలన ఇతరులకుశాంతి లభిస్తుంది. సమస్తజీవులపట్ల కారుణ్యభావం కలిగి, సత్యనిష్ఠతో ఎల్లప్పుడు ధర్మకార్యాలు చేసేవ్యక్తి మేలుకొని ఉండడం మంచిది.

ప్రశ్న : భగవాన్ ! బలం కలిగిఉండడం మంచిదా ? లేక బలహీనుడుగా ఉండడం మంచిదా ?

మహా : జీవులు బలంకలిగి ఉండడమూ మంచిదే. బలహీనుడుగా ఉండడమూ మంచిదే.

ప్రశ్న : రెండూ ఎలా కుదురుతవి స్వామీ ?

మహా : సద్వివేకం కలవాడు బలవంతుడైతే, వాడు తనబలంతో కోటిమానవులకు సుఖశాంతులు చేకూరుస్తాడు. కనుక మంచివాని బలం సంఘానికి మేలుచేస్తుంది.

పాపాత్ముడు, అధర్మసంచారి అయినవాడు బలహీనుడుగా ఉండడమే మంచిది. ఎందుకనగా బలంలేకపోవడంతో వాడు ఇతరులకు ఎక్కువ హానికలిగించలేడు.

ఈవిధంగా మహారాణి జయంతి మనసులోఉన్న సందేహాలకు చక్కగా సమాధానాలు చెప్పి, మహావీరుడు ఆమెను జ్ఞానిగాచేశాడు. ఆతరువాత ఆమె భగవానుని భక్తురాలయింది.

11

మరోసారి ఇంద్రభూతి గౌతముడు అడిగిన ప్రశ్నలకు భగవాన్ మహావీరుడు ఈప్రకారంగా జవాబులిచ్చాడు:

ప్రశ్న : మానవుడు ఏపాపంవలన దరిద్రుడవుతాడు ?

మహా : ఈజన్మలో ఇతరులధనాన్ని అపహరించినవాడు, దానం చేయతలచినవాణ్ణి ఆపినవాడు వచ్చేజన్మలో దరిద్రుడై పుడతాడు.

ప్రశ్న : ఈజన్మలో అన్నీ ఉండికూడా, కొంతమంది అనుభవించలేరు. ఎందుచేత భగవాన్ ?

మహా : దానం చేసినతరువాత లేక పుణ్యకార్యం చేసినతరువాత, అయ్యో వ్యర్థంగా దానం చేశానే అనీ అనవసరంగా ఆపనిచేశానే అనీ అనుకునేవ్యక్తి అన్నిభోగభాగ్యాలు కలిగిఉండి కూడా, ఏమీ అనుభవించలేడు.

ప్రశ్న : కొంతమందికి సంతానం ఎందుచేత కలగదు స్వామీ ?

మహా : మార్గంలో ఉండి నలుగురికి నీడను ఇచ్చే చెట్లను నరికివేసినందువల్లా లేక ఆచెట్లను ఇతరులచేత కొట్టించినందువల్లా, సంతానం కలగదు.

ప్రశ్న : మానవుడు గుడ్డివాడు ఎందుకవు తాడు భగవాన్ ?

మహా : తేనెటీగలతుట్టె కింద పొగపెట్టి, తేనెటీగలను వెడలకొట్టి, ఆ తుట్టెను కిందపడగొట్టిన పాపంవల్ల మానవుడు గుడ్డివాడై పుడతాడు.

ప్రశ్న : హే ప్రభూ ! మానవుడు మూగవాడుగా ఎందుకు పుడుతున్నాడు ?

మహా : ఇతరుల తప్పులను లెక్కబెడుతూ, ఇతరులను నిందిస్తూ, దేవతలను, గురువులను నిందించిన పాపఫలంగా మానవుడు మూగవాడై పుడుతున్నాడు.

ప్రశ్న : మనుష్యుడు ఏపాపఫలితంగా చెవిటివాడవు తున్నాడు స్వామీ ?

మహా : చాటుమాటుగా ఇతరుల దుష్కృత్యాలను గురించి వింటూ, తియ్యగా మాట్లాడి ఇతరుల రహస్యాలను గ్రహించే ప్రయత్నం చేసే వాడు మరుజన్మలో చెవిటివాడుగా పుడు తాడు.

ప్రశ్న : ఈ ప్రపంచంలో అందరికంటే అయోగ్యుడు ఎవరు భగవాన్ ?

మహా : నిష్కారణంగా ఇతరులతో వైరభావం పెట్టు కునేవాడు అయోగ్యుడు.

ప్రశ్న : స్వర్గం - మోక్షం ఎలా లభిస్తవి స్వామీ ?

మహా : చక్కగా తపస్సు- సాధన చేసి. సంయమ పూర్వకంగా జీవించి, పరోపకారం చేసే వ్యక్తికి సులభంగా మోక్షం లభిస్తుంది.

ప్రశ్న : సుఖ సంపత్తులు పొందాలంటే మానవుడు ఏం చేయాలి ?

మహా : సాధువులకు, మునులకు, అనాథలకు, దీనులకు ఆశ్రయ హీనులకు భోజనంపెట్టి, దాన పుణ్యాలు చేసే వానికి, మరు జన్మలో సుఖ సంపత్తులు లభిస్తవి.

ఈ విధంగా శిష్యులు అడిగే ప్రశ్నలకు జవాబులు చెబుతూ, భగవాన్ మహావీరుడు సమస్త ప్రజలను ఆదర్శ